సాక్షి నల్లగొండ

గురువారం । 11 । జనవరి । 2024



నెగ్గిన అవిశ్వాసం
చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌పై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.
- 8లో



ఖోఖోలో విద్యార్థినుల సత్తా
దామరచర్ల గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు చదువుతోపాటు ఇటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు.
- 10లో



విద్యుత్ లైన్ వేయొద్దంటూ..
తన వ్యవసాయ పొలంలో నుంచి విద్యుత్ లైన్ వేయొద్దంటూ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.
- 10లో

న్యూస్‌రీల్

నేడు వడ్డె ఓబన్న జయంతి

నల్లగొండ : తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని గురువారం నల్లగొండలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ జయంతి కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

12న క్రీడా పోటీలు

నల్లగొండ టూటౌన్ : ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బాల, బాలికలకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి మక్బుల్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 17 సంవత్సరాలలోపు క్రీడాకారులకు తైక్వాండో, 15, 19, 25 సంవత్సరాల లోపు క్రీడాకారులకు బ్యాడ్మింటన్ పోటీలు నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో 12వ తేదీ ఉదయం 9 గంటలకు ఇండోర్ స్టేడియం వద్దకు రావాలని పేర్కొన్నారు.

జానపద కళాకారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

నల్లగొండటౌన్ : జానపద వృత్తి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహ కోరారు. నల్లగొండలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జానపద కళాకారులకు రూ.6000 పింఛన్, ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలనికోరారు. యాదగిరిగుట్టలో జానపద కళాకారులతో హరినామస్మరన కార్యక్రమాలు నిర్వహించి తగిన పారితోషికం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాంపల్లి చంద్రమౌళి, కుమ్మరి శంకర్, మాద సైదులు, పల్లె ప్రసాద్, ఆమనగంటి ఐలయ్య, దండు శంకర్, గురుపాటి శ్రీనివాస్, విజయ, అంజమ్మ, ప్రభాకర్, అద్దంకి నరసింహ, యాదగిరి, సత్యనారాయణ స్వప్న, సైదమ్మ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

యువజనోత్సవాలకు ఎంపిక

నల్లగొండ రూరల్ : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరగనున్న 27వ యువజనోత్సవాలకు నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.జ్యోతి ఎంపికయ్యారు. ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి పాల్గొనే వలంటీర్ల బృందానికి ఆమె నాయకత్వం వహిస్తారు. జ్యోతి ఎంపిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యామ్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

పది జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీటీడీఓ రాజ్‌కుమార్

పెద్దవూర : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి (డీటీడీఓ) ఎస్‌పి.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పెద్దవూరలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల, ఎస్టీ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. పదో తరగతిలో పది జీపీఏ సాధించిన విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ రూ.50వేల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పాఠశాల దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఏటీడీఓ కడారు లక్ష్మారెడ్డి, ఆశ్రమ పాఠశాల హెచ్ఎం డి.బాలోజీ, వార్డెన్ కొల్లు బాలకృష్ణ, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, ఎండీ.షబ్బీర్, బి.కృష్ణ, శ్రీను, సురేందర్, సంధ్య, సైదులు, శాంతి, రామయ్య, షాహీన్‌బేగం పాల్గొన్నారు.

గడువు 20 రోజులే..

ముగియనున్న పంచాయతీల పదవీకాలం

- అభివృద్ధి పనుల బిల్లులు అందక సర్పంచ్‌ల ఇబ్బందులు
- తెచ్చిన అప్పులకు వడ్డీలు కూడా కట్టలేకపోతున్నామని ఆవేదన
- పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు



నిర్మాణం పూర్తయిన మాడుగులపల్లి మండలం పాములపహాడ్ వైకుంఠధామం

మిర్యాలగూడ : సర్పంచ్‌ల పదవీకాలం 20 రోజుల్లో ముగియనుంది. ఈలోపు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గాన్ని ఎన్నుకోవాల్సి ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికలు దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచ్ ఎన్నికలపై దృష్టి పెట్టడం లేదు. పదవీ కాలం ముగిశాక తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు పంచాయతీ కార్యదర్శులు ఇన్‌చార్జిలుగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తమకు రావాల్సిన పెండింగ్ బిల్లుల కోసం సర్పంచ్‌లు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

సర్పంచ్‌లకు అందని బిల్లులు..

జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, వీధి లైట్ల ఏర్పాటు, డంపింగ్‌యార్డులు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాల నిర్మాణం చేపట్టారు. గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ట్రాక్టర్లను అందించింది. మల్టీ పర్పస్ వర్కర్లను నియమించింది. కాగా, కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీల్లో పనిచేసే సిబ్బంది జీతాలు, నిర్వహణకు కూడా సరిపోని పరిస్థితి. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి బిల్లుల మంజూరులో జాప్యం కావడంతో సర్పంచ్‌లు అప్పులు చేసి మరీ పనులు పూర్తి చేశారు. ఇలా ఒకొక్కరు సుమారు రూ.5లక్షల నుంచి రూ.30లక్షల వరకు అప్పులు చేశారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల్లో తమ పదవీకాలం ముగుస్తుండడం.. చేసిన పనులకు ప్రభుత్వం నుంచి బిల్లులు అందకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

రూ.300 కోట్లకు పైగా పెండింగ్!

గ్రామాల్లో రైతు వేదికలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డు పనులు అధికారులు సర్పంచ్‌లపై ఒత్తిడి తీసుకొచ్చి మరీ పూర్తి చేయించారు. ఒక్కో రైతు వేదికను రూ.22లక్షల అంచనా వ్యయంతో నిర్మించగా అందులో రూ.12 లక్షలు ఉపాధి హామీ నిధుల నుంచి ఖర్చు చేయగా మిగిలిన రూ.10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఉపాధిహామీ నుంచి నిధులు వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లులు ఇంత వరకు అందలేదని పలువురు చెబుతున్నారు. ఇలా ప్రతి పనికీ అరకొరగానే బిల్లులు విడుదలయ్యాయని అంటున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా రూ.300 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. నూతన ప్రభుత్వమైనా పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి ఆదుకోవాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

రూ.70లక్షలు రావాల్సి ఉంది..



గ్రామాభివృద్ధి కోసం వడ్డీకి తీసుకొచ్చి పని చేశా. ఆ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, నీటి సమస్య తీర్చేందుకు బోరు మోటార్లకు ఖర్చు చేశా. ఈనెల చివరన పదవీకాలం ముగియనుంది. నేను గ్రామాభివృద్ధి కోసం పెట్టన ఖర్చులో ఇంకా రూ.70 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. పెట్టిన డబ్బులు వెంటనే చెల్లించకపోతే ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉంది. కొత్త ప్రభుత్వమైనా బిల్లులు చెల్లించాలి.

– చల్లా అంజిరెడ్డి, సర్పంచ్, వీర్లపాలెం

అప్పులు తెచ్చి అభివృద్ధి చేశాం



గ్రామాభివృద్ధికి కోసం ఖర్చు చేసిన నిధులను వెంటనే విడుదల చేయాలి. అప్పులు తీసుకొచ్చి మరీ పనులు చేపట్టాం. దానికి సంబంధించిన ఎంబీ రికార్డులను కూడా సమర్పించాం. వెంటనే బిల్లులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. మా గ్రామంలో రూ.30 లక్షల అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే వాటిని అందించాలి. పదవీ కాలం పొడిగించాలి.

– దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, సర్పంచ్, రావులపెంట



డ్రైవర్లకు సంఘీభావంగా రాస్తారోకోలో కూర్చున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : డ్రైవర్లకు ఇబ్బందిగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల ఈదులగూడ చౌరస్తా వద్ద డీసీఎం డ్రైవర్లు నిర్వహించిన రాస్తారోకోకు ఆయన మద్దతు తెలిపిన మాట్లాడారు. డ్రైవర్లను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టేందుకు కేంద్ర కొత్త చట్టం తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం వల్ల రోడ్డు ప్రమాదం జరిగితే పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదాలు చేయాలని ఎవరూ అనుకోరని, ప్రమాదవశాత్తు జరిగే వాటికి డ్రైవర్లను బాధ్యులను చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాస్తారోకో చేస్తున్న నాయకులను బలవంతంగా పక్కకు జరిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డబ్బికార్ మల్లేష్, రామ్మూర్తి, రవినాయక్, నాగాటి జోసెఫ్, అనంతుల రాజేష్, పుట్టల బాబు, సైదులు, బాబా, రవి, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా రమేష్‌గౌడ్

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, యామా కవితాదయాకర్, బండారు ప్రసాద్, కమిషనర్ వెంకటేశ్వర్లు పూల బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు.



అభినందనలు తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి

మాడుగులపల్లి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) భిక్షపతి సూచించారు. మాడుగులపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులు, పాఠ్యాంశాల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యా ప్రమాణాలు పెంచేందుకు విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా కొత్త విషయాలను నేర్చుకొని విద్యార్థులకు బోధించాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటమ్మ, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, వెంకట్రాములు, శ్రీనివాస్‌రెడ్డి, షరీఫ్, సైదులు, ఉపాధ్యాయినులు శ్రీలత, వినోద, సిబ్బంది పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

డేటా ఎంట్రీ వేగవంతం చేయాలి



నార్కట్‌పల్లిలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, పక్కన అదనపు కలెక్టర్

- కలెక్టర్ హరిచందన

చిట్యాల, నార్కట్‌పల్లి: ప్రజాపాలన కింద ప్రజలు అందించిన దరఖాస్తులను ఆన్‌లైన్ డేటా (కంప్యూటరీకరణ) ఎంట్రీ ప్రక్రియను ఎలాంటి తప్పుల్లేకుండా వేగవంతంగా చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన అధికారులకు ఆదేశించారు. చిట్యాల తహసీల్దార్, నార్కట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయాల్లో కొనసాగుతున్న అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను బుధవారం ఆమె.. జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆపరేటర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారులల ఆధార్‌తోపాటు సెల్‌ఫోన్ నంబర్లను తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. టీం లీడర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎంటీ పూర్తి చేసిన దరఖాస్తులన్నింటినీ ట్రంక్ పెట్టెల్లో భద్రపరిచాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో చిట్యాల మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, నార్కట్‌పల్లి మండల ప్రత్యేక అధికారి వెంకయ్య, ఎంపీడీఓ జి.యాదగిరి, తహసీల్దార్లు జి.దశరథ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని పకడ్బందీగా అమలు చేయాలి

నల్లగొండ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నల్లగొండ కలెక్టర్ హరిచందన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్‌డీఏ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. కొన్ని మండలాల్లో అభివృద్ధి పనులు వెనుకబడి ఉన్నాయని, అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు శాతం పెరిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాంపల్లి మండలంలో కూలీలకు అతి తక్కువ వేతనం రావడానికి గల కారణాలు తెలుసుకోవడంతోపాటు కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఏపీడీను ఆదేశించారు. మిర్యాలగూడ మండలంలో కూలీల సంఖ్య మెరుగు పరచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఆర్‌డీఓ కాళిందిని, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా

నల్లగొండ: ఈ నెల 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నల్లగొండ, తిప్పర్తి, చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి, కట్టంగూర్, మునుగోడు, గట్టుప్పల్, మాడ్గులపల్లి మండలాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను నిలిపివేసి సింగిల్ ఫేజ్ విద్యుత్ ఇస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్కట్‌పల్లి 220/132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆయా మండలాలకు సింగిల్ ఫేజ్ సరఫరా అవుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు. వ్యవసాయానికి మాత్రం సాయంత్రం 5 గంటలకు త్రీఫేజ్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ఆదాయంలో ప్రథమ స్థానంలో నిలపాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ డిపోలో వనభోజనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపోను ఆదాయంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక డిపోలో నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతతంగా వన భోజన మహోత్సవం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ అధికారులు, కార్మికులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రయాణికులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేది ఒక్క ఆర్టీసీ మాత్రమేనన్నారు. ఇటీవల తిరుపతికి వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పోకల వినోద్‌కుమార్ కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. ఆర్టీసీ కార్మికులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటాన్నారు. డిపో, బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆర్టీసీ సిబ్బంది ఆటా–పాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నల్లగొండ డిప్యూటీ ఆర్ఎం శివశంకర్, ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, కౌన్సిలర్ నాగలక్ష్మి, ఏఎంఎఫ్ పుష్పాల యాదగిరి, స్టేషన్ మేనేజర్ భిక్షమమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, కార్మిక సంఘాల నాయకులు జి.శ్రీనివాస్, ఎక్బాల్, రమేష్, జనార్దన్, కృష్ణారెడ్డి, వెంగల్‌రెడ్డి తదితరులున్నారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు

మునుగోడులో నాలుగు సీసీఐ కేంద్రాలు బంద్

- సమాచారం ఇవ్వకుండా మూసేసిన అధికారులు
- ఆందోళన చేపట్టడంతో వంద మంది రైతుల పత్తి కొనుగోలు
- కేంద్రాల్లో పెరిగిన నిల్వలు
- వారం తర్వాత కొనుగోలు చేస్తామన్న నిర్వాహకులు



మునుగోడులోని సీసీఐ కొనుగోలు కేంద్రం వద్ద బారులుదీరిన పత్తి ట్రాక్టర్లు

మునుగోడు : మునుగోడు మండలంలో గల పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన నాలుగు సీసీఐ కేంద్రాల్లో అర్ధంతరంగా పత్తి కొనుగోళ్ల నిలిపి వేశారు. ఎలాంటి సమచారం లేకుండా కేంద్రాలు మూసివేయడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ మద్దతు కంటే అధికంగా రేటు పలుకుతుందని రైతులు ఆశపడి ఇళ్లలో పత్తిని నిల్వ చేసుకున్నారు. అయితే ధర పెరగకపోగా సంక్రాంతి పండుగ దగ్గర పడుతుండడంతో తమ అవసరాల కోసం పత్తిని అమ్ముకునేందుకు మునుగోడు పరిసరాల్లోని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. కానీ ఆయా కేంద్రాల వద్ద పత్తిని కొనుగోలు చేయలేమని సీసీఐ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.

ఆందోళనకు దిగడంతో కొనుగోలు

మండలంలో మునుగోడులో మూడు, కొంపెల్లిలో ఒకటి మొత్తం నాలుగు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం దాదాపు 300 మందికి పైగా రైతులు ఆయా కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చారు. తీరా మిల్లుల వద్దకు వచ్చేసరికి మిల్లుల్లో పత్తి నిల్వకు స్థలం లేని కారణంగా కొనుగోళ్ల నిలిపివేస్తున్నామని బోర్డు పెట్టారు. దీంతో ఆగ్రహించిన రైతులు తమకు ఎలాంటి సమచారం లేకుండా కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేస్తుంటే కేవలం మునుగోడు మండలంలోనే నాలుగు కేంద్రాలు ఎందుకు నిలిపివేశారని కొద్దిసేపు ఆందోళనకు దిగారు. దీంతో స్పందించిన సీసీఐ అధికారులు ఈ ఒక్కరోజు మాత్రమే, అదికూడా క్యూలో ఉంచిన వాహనాల్లోని పత్తినే కొంటామని చెప్పారు. వంద మంది రైతుల పత్తిని కొన్నారు. వారం రోజుల తర్వాత తిరిగి కొనుగోళ్లు చేపడతామని వెల్లడించారు. దీంతో మిగిలిన రైతులు తమ పత్తిని మునుగోడులోని దళారులకు క్వింటా రూ.6,300 అమ్ముకొని ఇంటి బాట పట్టారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని సీసీఐ పత్తి కొనుగోళ్ల యథావిధిగా కొనసాగించేలా చూడాలని వేడుకుంటున్నారు.



పత్తి కొనుగోళ్ల నిలిపివేస్తున్నట్లు మునుగోడులో ఓ మిల్లు వద్ద పెట్టిన బోర్డు

పత్తి రైతుల ఆందోళన 8లో

వారం రోజుల వరకు పత్తి కొనలేం

మిల్లులో పత్తి నిల్వలు అధికంగా ఉండడంతో స్థలం లేని కారణంగా కొనుగోళ్ల నిలిపివేశాం. మరో వారం రోజుల వరకు పత్తిని కొనలేం. అందుకే మిల్లుల వద్ద పత్తి కొనుగోలు నిలిపివేశామని బోర్డులు ఏర్పాటు చేశాం. వారం తర్వాత మళ్లీ కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

– కుట్టికుమార్, చండూరు సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి

ఆందోళన చేసిన తర్వాత కొన్నారు



నేను 14 ఎకరాల్లో సాగు చేసిన పత్తిని అమ్ముకునేందుకు మంగళవారం ట్రాక్టర్‌లో సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చా. కానీ మరునటి రోజు కొనుగోలు చేస్తారని అక్కడే పడిగాపులు కాసిన. అర్ధంతరంగా బుధవారం కొనుగోళ్ల నిలిపివేసినట్లు మిల్లు గేటుకు బోర్డు పెట్టారు. క్యూ కట్టిన రైతులంతా కలిసి ఆందోళన చేస్తే మధ్యాహ్నం తర్వాత కొంత మంది పత్తిని కొనుగోలు చేశారు. మిగతా వారి పరిస్థితి అయోమయంగా ఉంది.

– బైరుకొండ సతీష్, రైతు చొల్లేడు

క్లుప్తంగా

హత్య కేసుపై డీఎస్పీ విచారణ


హతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

మద్దిరాల: ఇటీవల చోటు చేసుకున్న హత్య కేసుపై బుధవారం సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం మద్దిరాల మండల కేంద్రంలో విచారణ జరిపారు. మండల కేంద్రానికి చెందిన కుంచం కళమ్మ(46)ను ఆమె భర్త వెంకన్న ఆస్తి తగాదాల నేపథ్యంలో హత్య చేసిన విషయం తెలిసిందే. కేసు విచారణలో భాగంగా సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం మద్దిరాలలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు, సాక్షులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట సీఐ బ్రహ్మమురారి, ఇంచార్జి ఎస్ఐ సైదులు, ఏఎస్ఐ నాగయ్య, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభ్యుదయ కవి బాలయ్య మృతి


గోదాసు బాలయ్య (ఫైల్)

రామన్నపేట: రామన్నపేట పట్టణానికి చెందిన అభ్యుదయ కవి గోదాసు బాలయ్య బుధవారం మృతిచెందాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాలయ్య ప్రజా సమస్యలపై, సమాజంలోని పోకడలపై, విప్లవ భావాలతో కూడిన అనేక రచనలు చేసి అభ్యుదయ కవిగా పేరుపొందారు. బాలయ్య మృతదేహాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దిన్, మాజీ సర్పంచ్ ఆకవరపు మధుబాబుతో పాటు వార్డు సభ్యులు లెంకల ప్రవీణ్ నివాళులర్పించారు.

హత్య ఘటన స్థలం పరిశీలన


హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం తెలగ రామయ్యగూడెంలో ఈనెల 2న సోమగాని లీలమ్మ హత్యకు గురైన విషయం తెలిసిందే. బుధవారం ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. లీలమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలై వివిధ ప్రాంతాల్లో ఉంటుండగా లీలమ్మ ఒక్కతే ఇంటి వద్ద ఉంటోంది. లీలమ్మ హత్యకు గల కారణాలను ట్రైనీ ఐపీఎస్ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తదితరులున్నారు.

రైతులకు సాగు నీరు అందించాలి

మోతె : రైతులకు సాగు నీరు అందించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు విడుదల చేసిన సందర్భంగా చివరి ఆయకట్టు అయిన మోతె నడిగూడెం మండలాలకు సాగు నీరు అందించే దిశలో అధికారులు తచర్యలు తీసుకోవాలన్నారు.

మోటారు వైర్లు చోరీ

ఆలేరురూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటారు వైర్లను అపహరించారు. ఈ ఘటన ఆలేరు మండలంలోని గుండ్లగుడెం గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన దూసరి అంజయ్య, దేవిరెడ్డి గోపాల్‌రెడ్డితో పాటు మరికొందరి మోటారు వైర్లను దుండగులు అపహరించుకుపోయారని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సీసీఐ కేంద్రంలో పత్తి రైతుల ఆందోళన

- తూకంలో తేడా, తరుగు పేరుతో కోతలపై రైతుల ఆగ్రహం


సీసీఐ కేంద్రం సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న రైతులు

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ వద్ద గల కాటన్‌మిల్‌లో కొనసాగుతున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద బుధవారం రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అధికారులు దళారులతో కుమ్మక్కై పత్తి కొనుగోలులో అనేక రకాలుగా మోసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తూకంలో మోసం చేయడంతో పాటు తరుగు, నాణ్యత పేరుతో క్వింటాలుకు 5 నుంచి 10కిలోలు కోతలకు పాల్పడుతున్నారన్నారు. పత్తిధర విషయంలో కూడా ప్రభుత్వం క్వింటాలుకు రూ.7020 మద్దతు ధర ప్రకటిస్తే నాణ్యతాలోపం పేరుతో రూ.6900 ధర చెల్లిస్తున్నారంటూ సీసీఐ అధికారులతో రైతులు తీవ్ర వాగ్వాదం చేశారు. వేబ్రిడ్జి తూకంలో వచ్చిన తేడాపై సంబంధిత సిబ్బందితో రైతులు వాగ్వాదం చేస్తుండగా పరిస్థితి చేయిదాటడంతో ఘర్షణ పడ్డారు. వెంటనే అక్కడున్న కొంతమంది రైతులు ఘర్షణను నిలువరించారు. వేబ్రిడ్జి తూకంలో తేడాలు లేవని, ఒక వాహనాన్ని తూకం వేసిన తర్వాతా మరో వాహనం తూకం వేసేముందు కంప్యూటర్‌లో జీరో చేయాల్సి ఉంటుందని కాటన్‌మిల్లు సిబ్బంది రైతులకు వివరించారు. అందుకోసం మరోమారు తూకం వేసి పరిస్థితిని వివరించడంతో రైతులు తూకం విషయంపై శాంతించారు. సీసీఐ కేంద్రానికి శాలిగౌరారం, నకిరేకల్ మండలాల నుండి సుమారు 50 ట్రాక్టర్లు పత్తిలోడ్లతో రాగా 26 ట్రాక్టర్లను మాత్రమే కాటన్‌మిల్లులోకి అనుమతించి పత్తిని కొనుగోలు చేశారు. మరో 24 ట్రాక్టర్లు కాటన్‌మిల్లు బయటనే నిలిచి ఉండటంతో మొత్తం పత్తిని కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. రైతుల ఆందోళన నేపథ్యంలో కాటన్ మిల్లు యజమాని సీసీఐ అధికారులతో మాట్లాడి బయట ఉన్న 24 ట్రాక్టర్లను రాత్రి కొనుగోలు కేంద్రం లోపలికి అనుమతింపజేశారు. దీంతో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పత్తి రైతుల ఆందోళన రాత్రి 9గంటలకు పత్తిలోడు ట్రాక్టర్లను కొనుగోలు కేంద్రం లోపలికి అనుమతించడంతో ముగిసింది.

వేతన సవరణ చేపట్టాలని ధర్నా


కోదాడలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

కోదాడఅర్బన్ : వేతన సవరణ చేపట్టాలని కోరుతూ కోదాడ ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆ సంస్థ ఉద్యోగులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడారు.పాత పింఛన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘం నాయకులు కోరారు. దేశంలో 30కోట్లకు మంది పైగా బీమా అందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. కార్యక్రమంలో క్లాస్‌-1 అధికారులు ఎండీఎం సంజీవయ్య, శ్యాంబాబు, రామారావు, డెవలెప్‌మెంట్ అధికారులు మల్లం రమేష్, ఆదినారాయణ, అంజిరెడ్డి, యూనియన్ కార్మిక సంఘం నాయకులు విజయశంకర్, బికన్నయ సువర్ణరాణి, కరుణానాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

సూర్యాపేట క్రైం : సూర్యాపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఇద్దరు వ్యక్తులు అమాయకుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారు. ఆగ్రహించిన బాధితులు మోసగించిన వ్యక్తి భార్యను చితకబాదారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేటలోని చంద్రన్నకుంటకు చెందిన చింతా సతీష్, నబీలు ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగో తరగతి ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారు 30మంది నుంచి రూ.48లక్షలు వసూలు చేశారు. ఈ విషయమై గతంలోనే వీరిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది. ఉద్యోగం రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు సతీష్ భార్య కళ్యాణిని బుధవారం స్థానిక ముత్యాలమ్మ గుడిలో బంధించి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఇచ్చిన డబ్బులకు కనీసం అప్పు పత్రమైనా రాసి ఇవ్వాలని కోరారు. ఆమె అందుకు అంగీకరించకపోవడంతో చితకబాదారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెను విడిపించి పంపించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

బీబీనగర్: బైక్‌పై గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బోడుప్పల్, నాగర్‌కర్నూల్‌కు చెందిన మహమ్మద్ సమీర్, దీకొండ పవన్ కల్యాణ్‌లు, గడ్డం శోభన్‌లు ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు వద్ద మూడు ప్యాకెట్ల గంజాయిని సేకరించారు. దానిని హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 13కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేంధర్ తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి


గాయపడిన జింక

సూర్యాపేట రూరల్ : కుక్కల దాడిలో జింక మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, ఫారెస్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యర్కారం గుట్టల నుంచి తప్పిపోయి గ్రామంలోకి వచ్చిన జింకను కుక్కలు వెంబడించి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన గ్రామస్తులు సూర్యాపేట ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని జింకను పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. గురువారం సూర్యాపేట పశువుల వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎఫ్ఆర్ఓ ఆఫీస్‌ఖాన్ తెలిపారు.

కుక్కదాడిలో పలువురికి గాయాలు


గాయపడిన చెన్నమ్మ

మఠంపల్లి: కుక్కదాడిలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెంలో చోటు చేసుకుంది. రఘునాథపాలెం గ్రామ శివారులో మిర్చితోటలో కూలీలు పని చేస్తుండగా కుక్క అకస్మాత్తుగా వచ్చి దాడి చేసింది. దాడిలో గ్రామానికి చెందిన కూలీలు భూసిపల్లి చెన్నమ్మతో పాటు ఉమా, హనుమంతుగూడేనికి చెందిన లక్ష్మి, మఠంపల్లికి చెందిన ప్రశాంతి, దేవ్లాతండాకు చెందిన బానోతులక్ష్మితో పాటు పలువురికి గాయాలపాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. బాధితులు స్థానికంగా చికిత్స పొందుతున్నారని తెలిపారు.

పదిమంది జూదరుల అరెస్ట్

త్రిపురారం : మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామ శివారు పరిధిలో డంపింగ్ యార్డు వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్ట్ చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు స్థానికులతో నమ్మదగిన సమాచారం రావడంతో దాడులు చేసి పదిమందిని అరెస్ట్ చేశామని ఎస్ఐ వీర శేఖర్ తెలిపారు. పేకాట ఆడుతున్న వీరి నుంచి రూ. 3 వేల నగదు, 6 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భువనగిరి క్రైం: రోడ్డు ప్రమాదంలో యవకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో బుధవారం చోటు చేసుకుంది. భువనగిరి మండలం సూరెపల్లి గ్రామానికి చెందిన భరత్ తన బైక్‌పై భువనగిరి పట్టణ శివారులోని పెద్ద చెరువు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న డీసీఎం వాహనం ఒక్కసారిగా యూటర్న్ తీసుకుని భరత్ నడుపుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారని ఆరోపణ

నూతనకల్ : మండల పరిధిలోని చిన నెమిల క్రాస్ రోడ్డులో గల నయారా పెట్రోల్ బంక్‌లో కల్తీ పెట్రోల్ అమ్ముతున్నారని వినియోగదారులు ఆరోపించారు. బుధవారం ఆ బంక్‌లో మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన నర్సింగ్ లింగయ్య రూ.200పెట్రోల్‌ను బాటిల్‌లో పట్టుకున్నాడు. అదే విధంగా చిన నెమిల గ్రామానికి చెందిన మంగదుడ్ల శేఖర్ రూ.100పెట్రోల్ బాటిల్‌లో పట్టగా ఇద్దరివి వేర్వేరు రంగులో ఉండడమే కాకుండా వాసన కూడా తేడా ఉందని వినియోగదారులు తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కిరాణ దుకాణంలో చోరీ

కొండమల్లేపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన వీరమళ్ల ఎల్లయ్య కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. బుధవారం తిరిగి దుకాణం తెరిచే సరికి సామాన్లు చిందరవందరగా ఉండడాన్ని గమనించగా చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. వెంటిలేషన్‌ను తొలగించి అక్కడి నుంచి లోపలికి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.10వేల విలువైన కిరాణ సామగ్రితో పాటు రూ.8వేల నగదును అపహరించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయినట్లు తెలిపాడు.

ప్రభుత్వ విధానాలపై సంఘటిత పోరు

రామగిరి(నల్లగొండ) : కేంద్ర ప్రభుత్వ విధానాలపై సంఘటిత పోరు తప్పదని ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (సీసీఈయూ) సభ్యులు హెచ్చరించారు. బుధవారం నల్లగొండలోని ఎల్ఐసీ కార్యాలయం ముందు సంస్థ ఉద్యోగులు సమ్మె చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ కొత్తగా స్టాఫ్ రిక్రూట్‌మెంట్ చేయాలని, జీఎస్టీని తొలగించాలని, వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నవీన్‌గౌడ్, కృష్ణయ్య, డీఓలు గురుమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగర్‌కు జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న అధికారులు

నాగార్జునసాగర్: జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తశి రబ్‌స్తాన్ బుధవారం నాగార్జునసాగర్‌కు తన కుటుంబంతో వచ్చారు. వీరికి డిప్యూటీ తహసీల్దార్ శరత్‌చంద్ర, నిడమనూరు కోర్టు సిబ్బంది స్వాగతం పలికారు. జస్టిస్ తశి రబ్‌స్తాన్ గురువారం సాగర్ ప్రాజెక్టుతో పాటు బుద్ధవనం, నాగార్జునకొండను సందర్శించనున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


దుర్గాబాయి మృతదేహం

కోదాడరూరల్ : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందింది. ఈ ఘటన కోదాడ పట్టణంలోని పాతపోస్టాఫీసు వీధిలో బుధవారం చోటు చేసుకుంది. కోదాడ మండలం మంగళితండాకు చెందిన రమావత్ విజయదుర్గాబాయికి (28)కు నాగార్జునసాగర్ రైట్‌బ్యాంక్‌కు చెందిన రాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారు కోదాడ పట్టణంలోని భవానీనగర్‌లో నివసిస్తూ పాతపోస్టాఫీసు బజారులో బట్టల దుకాణం నడుపుతున్నారు. ఆరు నెలలుగా భర్త ఆమెను అనుమానంతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె బుధవారం బట్టల దుకాణంలోని స్టాక్‌రూంలో ఉరేసుకుంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసేవరకు మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు మాత్రం భర్తే చంపి ఫ్యాన్‌కు ఉరేసాడని ఆరోపిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై మృతురాలి తండ్రి బాబ్ సింగ్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం


చిట్యాల: వెలిమినేడులో పీఏసీఎస్ చైర్మన్ అవిశ్వాస తీర్మాన సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్‌లు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షంపై ఆ సొసైటీ డైరెక్టర్‌లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బుధవారం సొసైటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ రుద్రారపు భిక్షం హాజరకాలేదు. మరో డైరెక్టర్ కోనేటి లింగయ్య కొంతకాలం క్రితం మృతి చెందాడు. 11 మంది డైరెక్టర్లలో వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, డైరెక్టర్లు పిశాటి భీష్మారెడ్డి, ఏనుగు రఘుమారెడ్డి, గడ్డం సత్తిరెడ్డి, టేకుల కవిత, మేడి అచ్చమ్మ, మామిడి శ్రీరాములు, ఎదుళ్ల అజిత్ రెడ్డి, మురాల గోపయ్య, గంగాపురం భాస్కర్, బోయపల్లి స్వామి ఈ అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరయ్యారు. డీసీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సహకార సంఘాల క్లస్టర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు విజయ్‌కుమార్, షణ్ముఖచారి సమక్షంలో సమావేశం నిర్వహించారు. చైర్మన్ భిక్షంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి 11 మంది డైరెక్టర్‌లు చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో పీఏసీఎస్ చైర్మన్ భిక్షంపై అవిశ్వాసం నెగ్గిందని డీసీఓ ప్రకటించారు. గురువారం ఉదయం 11 గంటలకు సొసైటీ కార్యాలయలలో నూతన చైర్మన్ ఎన్నిక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మాన సమావేశం అనంతరం ఓటింగ్‌లో పాల్గొన్న 11 మంది డైరెక్టర్లు క్యాంపునకు తరలి వెళ్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై 19న విచారణ

- నోటీసులు జారీ చేసిన తహసీల్దార్
- ఆధారాలు చూపకపోతే భూమి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మకాలనీలోని చింతపల్లి శివారులో సర్వే నంబర్ 5 లోని ప్రభుత్వ భూమి కబ్జాపై అధికారులు దృష్టి సారించారు. ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడే పనిలో నిమగ్నమయ్యారు. ఉన్న భూమిని రికార్డుల్లో అక్రమంగా పెంచి కొందరు ధరణిలో పేరు నమోదు చేయించుకోగా ఆ అక్రమాలపై ‘సాక్షి’ ఇటీవల కథనంతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై అధికారులు స్పందించి విచారణ చేపట్టారు. సర్వే నంబర్ 5లో ఎంత భూమి ఉంది, వాస్తవానికి ఎంతమందికి అసైన్‌మెంట్ చేశారు.. ఎవరెవరూ అనధికారికంగా పేర్లు ఎక్కించుకున్నారు అనే వివరాలను సేకరించారు. పహాణీల ఆధారంగా రికార్డుల్లో ఉన్న 16మందికి నోటీసులు జారీ చేశారు. తమకు ప్రభుత్వ భూమి ఎలా సంక్రమించిందో దానికి సంబంధించిన ఆధారాలు, సర్టిఫికెట్లు ఈనెల 19వ తేదీలోగా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. పూర్తి ఆధారాలను సమర్పించాలని, లేనిపక్షంలో భూమిని తిరిగి స్వాధీన పరుచుకుంటామని, అక్రమాలకు పాల్పడినట్లు తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరిబాబు హెచ్చరించారు.

ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నల్లగొండ: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అంతకుముందు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి భిక్షపతి, విజయ్ కుమార్, యానం విజయ్‌కుమార్, ఉదావత్ లచ్చీరాం, మాతంగి ప్రభాకర్, బొడ్డు హుస్సేన్, పాల్వాయి వెంకటయ్య, బోయ రాములు, బొల్లెద్దు కరుణాకర్, దుబ్బాక యాదయ్య పాల్గొన్నారు.

పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకం


సందీప్‌కుమార్, ఏవో, పెద్దవూర

పెద్దవూర: పంటల సాగులో ఎరువుల వాడకమే కీలకమని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొంటున్నారు. ఏయే దశల్లో ఎంత మోతాదులో ఏయే ఎరువులు వాడాలనే విషయంపై రైతులు పూర్తిగా వగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు. ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని తెలుపుతున్నారు. ఎరువుల వినయోగానికరి సంబంధించి రైతులు పాటించాల్సిన పద్ధతులను ఆయన వివరించారు.

సేంద్రియ ఎరువులతో ఎంతో మేలు

సేంద్రియ ఎరువుల వాడకం మూలంగా అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉంది. నేలకు సేంద్రియ పదార్థాలు జీవం వంటివి. సేంద్రియ ఎరువుల వలన అన్ని రకాల పంటలకు పోషకాలు అందుతాయి. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని సొంతంగా వాటిని తయారు చేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గుతాయి. ఆ దిశగా రైతులు ఆలోచిస్తే నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చు. పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్ మడ్డి, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయ వ్యర్థ పదార్థాల వాడకం, జీవన ఎరువుల వాడకం ప్రాధాన్యతను గుర్తించాలి.


పెద్దవూరలో యూరియాను చల్లుతున్న రైతు

రసాయనిక ఎరువులతో నష్టం

రసాయనిక ఎరువుల వాడకం శ్రేయస్కరం కాదు. దీనివలన పెట్టుబడులు పెరగడమే కాకుండా భూసారంలో మార్పులు సంభవిస్తాయి. మరోవైపు పంట ఉత్పత్తుల్లో రసాయనిక అవశేషాలు మిగిలి ఉండి మార్కెట్లో దాని ప్రభావంతో డిమాండ్ తగ్గి ధరలు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉంది. విరివిగా, విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వాడటం తగ్గించాలి. వీటి వాడకం వలన క్రమేపీ పంట దిగుబడులు కూడా తగ్గుతాయి.

పాడి పంట

పాదుల్లో ఎరువు వేసే పద్ధతి

మొక్కల దగ్గర ఎరువులు వేసే పద్ధతి ద్వారా పోషక వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వృథా కూడా తగ్గుతుంది. నిర్ణీత వరుసల్లో మొక్కలు ఉన్నప్పుడు పొలాన్ని 2 అంగుళాల మేర లోతు చేసుకుని తేమ ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల దగ్గర ఎరువు పడేలా వేయాలి. చిన్నపాటి గుంతలు తీసి ఎరవులు వేసిన సమయంలో దానిని మట్టితో కప్పేలా చేసుకోవాలి.

ఏ దశలో, ఏ సమయంలో ఎరువులు వాడాలంటే..

పంటలకు నత్రజని అవసరం చివరి దశ వరకు ఉంటుంది. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో రెండు మూడు కీలక దశల్లో వాడుకోవాలి. ఏపుగా పెరిగేందుకు, పూత, మొగ్గ దశ, పంట దిగుబడి పెరిగే దశల్లో ప్రధానంగా వాడుకోవాలి.నత్రజనిని యూరియా రూపంలో వాడే సమయంలో వృథాని అరికట్టడానికి పైన చెప్పిన మిశ్రమాలను ఉపయోగించాలి. భాస్వరం ఎరువును మొత్తం మోతాదును విత్తే సమయంలో చివరి దుక్కిలో వేసుకోవాలి. దీంతో ఎరువు భూమిలో నిల్వ ఉండి కొద్దికొద్దిగా పంటకు అందుతుంది. పొటాష్ ఎరువులు మొక్కలో రోగ నిరోధక శక్తిని పెంచటంతో పాటు నాణ్యత కలిగిన ఉత్పత్తి వచ్చేలా చేస్తాయి.

ఎరువుల ధరలపై అవగాహన అవసరం

ఎరువుల వాడకం ఎంత ముఖ్యమో వాటి ధరలపై అవగాహన కలిగి ఉండటం కూడా అంతే ముఖ్యం. ఏయే ఎరువుల్లో ఏ శాతం ఎంత ఉంటుంది. నాణ్యత, ధరలు, నకిలీలు వంటి వాటిని గమనించాలి. దీనికి వ్యవసాయ అధికారులు, అవగాహన ఉన్న రైతుల సలహాలు తీసుకోవాలి. పోషకాలను దష్టిలో పెట్టుకుని కొనుగోలు చేయాలి. ప్రతి ఎరువు బస్తా మీద దానిలో ఉన్న పోషక విలువల శాతం స్పష్టంగా ఉంటుంది. అయితే సూచించిన దానికంటే పోషక విలువలు సగం శాతం మాత్రమే ఉంటాయనే విషయాన్ని గమనించాలి.